సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



సోమశిలలో 36.270 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 36.270 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 717 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	63,870
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,736
3శాతం జీఎస్టీతో	రూ.5,908
నవర (8గ్రా)	రూ.47,264

గరిష్టం/కనిష్టం
26.6 /23.4

వాతావరణం

శనివారం గాలిలో తేమ 86 శాతం ఉంది. ఆదివారం జిల్లాలోని పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

జాతీయ రగ్బీ పోటీలకు గండవరం విద్యార్థి



విద్యార్థి జితేంద్ర

కొడవలూరు: జాతీయ రగ్బీ అండర్–14 పోటీలకు మండలంలోని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్ జితేంద్ర ఎంపికయ్యారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు ఒడిశాలో జరిగే జాతీయ రగ్బీ అండర్–14 పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున జితేంద్ర ఆడనున్నారు. రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన జితేంద్రను ఆ పాఠశాలలో శనివారం హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, పీడీ సీహెచ్ శివనాగబాబు, కోచ్ వంశీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న మరోసారి సీఎం కావాలి



పాదయాత్ర చేస్తున్న గణేష్ బృందం

నెల్లూరు(క్రైమ్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలన్న సంకల్పంతో విశాఖపట్నం నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న వైఎస్సార్ అమరజ్యోతి స్టూడెంట్స్ అండ్ యూత్ ఫోర్స్ అధ్యక్షుడు గాలి గణేష్ బృందం శనివారం నెల్లూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా సమాజంలోని అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్న జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాలని వెంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తూ నవంబర్ 30న విశాఖ నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టామని, ఈ నెల 21వ తేదీకి తిరుమలకు చేరుకుంటామని తెలిపారు. ఆయన వెంట ప్రసాద్, సత్తిబాబు, ధర్మేంద్ర తదితరులు ఉన్నారు.

వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్ గేమ్స్‌లో వలంటీర్ సత్తా




థాయ్‌లాండ్‌లో విజయ దరహాసంతో భవాని

ముత్తుకూరు: ముత్తుకూరు–1 సచివాలయం పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తున్న దివ్యాంగురాలు వలసంగారి భవాని థాయిలాండ్‌లో జరిగిన క్రీడా పోటీల్లో భారత ప్రతిష్టను పెంచి, విజయబావుటా ఎగురవేసింది. థాయ్‌లాండ్‌లో ఈ నెల 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగిన 'వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్ గేమ్స్–2023'లో పారా ఒలింపిక్స్ కమిటీ ఇండియా తరఫున భవాని పాల్గొన్నారు. ఎడమ చెయ్యి లేకున్నా 100 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్‌లలో అత్యంత ప్రతిభ కనబరిచి కాంస్య పతకాలు సాధించి సత్తా చాటారు. అంతేకాకుండా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) తరఫున న్యూఢిల్లీలో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు జరిగిన ఖేలో ఇండియా–2023 స్పోర్ట్ గేమ్స్‌లో పాల్గొని 100 మీటర్ల పరుగుపందెంలో కాంస్యం, 200 మీటర్ల పరుగుపందెంలో రజతం, లాంగ్‌జంప్‌లో కాంస్యం పతకాలు సాధించి రాష్ట్ర ప్రతిష్టను పెంచారు. శనివారం ముత్తుకూరుకు వచ్చిన భవానీకి అభిమానులు, బంధువులు బాణసంచా పేలుళ్లు, మేళతాళాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. క్రీడా పోటీల్లో విలువైన పతకాలు సాధించిన భవానీని ఎంపీడీఓ లక్ష్మణకుమార్, ముత్తుకూరు పంచాయతీ కార్యదర్శి చక్రం వెంకటేశ్వర్లు అభినందించారు.

ఆత్మకూరులో పోటీకి ఆనం విముఖత?

అక్కడ గెలుపు కష్టమని వెనకడుగు

- నియోజకవర్గం మార్చాలని అధిష్టానానికి వినతి
- సర్వేపల్లి లేదా ఎంపీగా పోటీకి సిద్ధపడాలని నేతల సూచన
- ఎటూ పాలుపోక మౌనం దాల్చిన రామనారాయణరెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి చుక్కాని లేని నావలా తయారైంది. వైఎస్సార్‌సీపీ బహిష్కృత నేత, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిని టీడీపీ అధినేత చంద్రబాబు అక్కున చేర్చుకున్నారు. అయితే ఆనం ఇంకా టీడీపీ తీర్థం పుచ్చుకోకపోవడం గమనార్హం. ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీకి ఉన్న ఆదరణ చూసి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు ఆయన జంకుతున్నట్లు తెలిసింది.

వైఎస్సార్‌సీపీకి ఆదరణ

ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ గ్రాఫ్ పెరుగుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విద్యావంతుడు కావడంతో అభివృద్ధి విషయంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పేదవర్గాల ఆర్థిక ప్రగతికి తోడ్పాటునందిస్తుండడంతో అధికార పార్టీకి జోష్ పెరిగింది. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి విషయంలో తన మార్కు చూపిస్తున్నారు. ఏళ్లుగా పరిష్కారం కాని రెవెన్యూ సమస్యలను సైతం పరిష్కరించేందుకు నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై కలెక్టర్ వద్దే సమీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం (ఏడీఎఫ్) ద్వారా సొంత నిధులతో అభివృద్ధి పనులు చేస్తూ ప్రజాదరణ పొందుతున్నారు.

ఆత్మకూరు వద్దంటున్న ఆనం

ఆత్మకూరు నియోజకవర్గంలో కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన వారిని కాదని ఆనం వైపే టీడీపీ అధిష్టానం మొగ్గుచూపింది. టీడీపీ యువనేత లోకేశ్ యువగళం పాదయాత్రను ఆనం అన్నీ తానై నడిపించారు. దీంతో ఆత్మకూరు బాధ్యత ఆనందే అని లోకేశ్ చెప్పి వెళ్లాడు. యువగళం తర్వాత నెల రోజులపాటు నియోజకవర్గంలో హడావుడి చేసిన ఆనం ఆపై ముఖం చాటేశాడు. ఆయన తన సొంత టీంతో సర్వే చేయించుకుంటే ఓటమి తప్పదని సర్వేలో తేలిందట. దీంతో ఆనం సందిగ్ధంలో పడ్డారని పలువురు అంటున్నారు. ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ నుంచి నేతలు తన వెంట క్యూ కడతారని భ్రమపడిన ఆయనకు చుక్కెదురైందని, దీనికితోడు స్థానిక టీడీపీ నాయకులు కూడా సహకరించడం లేదని సమాచారం. టీడీపీ సీనియర్ నేతలు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, బొల్లినేని కృష్ణయ్యనాయుడు, గూటూరు కన్నబాబు లాంటి లీడర్లు ఆనంకు దూరంగా ఉంటున్నారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు సోదరులు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకోవడంతో టీడీపీకి మరింత ఎదురుదెబ్బ తగిలింది. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరేందుకు చాలా మంది నేతలు సిద్ధంగా ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అటు క్యాడర్ కలిసిరాక.. ఇటు నమ్ముకున్న నేతలు సహకరించపోవడంతో ఓటమి భయంతో ఆనం పోటీకి ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. తనకు ఆత్మకూరు వద్దని వెంకటగిరి లేదా నెల్లూరు సిటీ ఇవ్వాలని టీడీపీ అధిష్టానాన్ని కోరుతున్నారని తెలుస్తోంది. అధిష్టానం మాత్రం ఆత్మకూరు కాదంటే సర్వేపల్లి లేదా పార్లమెంట్‌కు పోటీ చేసేందుకు సిద్ధపడాలని చెప్పడంతో ఆనం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని అంటున్నారు. ఏం చేయాలో అర్థం కాక ఆనం మౌనం దాల్చారని రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

మత్స్యశాఖ జేడీ బదిలీ

నెల్లూరు(సెంట్రల్): జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావును పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు మత్స్యశాఖలో ఏడీగా విధులు నిర్వర్తిస్తున్న వీవీఆర్ బాబును ఇన్‌చార్జిగా నియమించారు.

జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' పథకం ద్వారా యూపీఎస్సీకి సిద్ధమవుతున్న వారికి ప్రోత్సాహకాలు అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ పథకం లబ్ధి కోసం అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత అధికారి రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరానికి యూపీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులు డిసెంబర్ 19వ తేదీ లోపు jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రిలిమ్స్‌లో పాసైన వారికి రూ.లక్ష, మెయిన్స్‌లో పాసైన వారికి రూ.50 వేలు ఈ పథకం ద్వారా ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారుల కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించరాదని తెలిపారు.

ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాన్నీ వివరిద్దాం





జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, జేసీ కూర్మనాథ్, పాల్గొన్న ప్రజాప్రతినిధులు

- తుఫాన్ సమయంలో అధికార యంత్రాంగం పనితీరు ప్రశంసనీయం
- జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్ అమలు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధితోపాటు ప్రతి పనిని ప్రజలకు వివరిద్దామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, ఇతర అధికారులతో కలిసి మంత్రి పాల్గొని మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక పక్కాగా అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. ప్రధానంగా స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు.

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్‌లపై కొన్ని పత్రికల్లో అసత్య కథనాలు రాస్తున్నారని, కనీస అవగాహన లేకుండా కథనాలు రాయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా రూ.25 లక్షల వరకు వైద్యసేవలు అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, గత ప్రభుత్వం మాదిరి కాకుండా, వార్షికాదాయం రూ.5 లక్షలు ఉన్నా ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్యులు, సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి ఉచితంగా వైద్యసేవలు, మందులు అందజేసిన విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు.

పెంచిన పింఛన్ జనవరి నుంచే..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటి వద్దకే పింఛన్ నగదు అమలు చేస్తున్నారని, పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి జనవరి ఒకటో తేదీ నుంచి అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే 'వైఎస్సార్ ఆసరా' నగదును జనవరి 10వ తేదీ నుంచి, వైఎస్సార్ చేయూత నగదును జనవరి 29వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేలా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాలను ఈ నెల 26వ తేదీన ప్రారంభించనున్నట్లు తెలిపారు. తుఫాన్ సమయంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పనితీరు ప్రశంసనీయమని కొనియాడారు. ప్రధానంగా విద్యుత్ శాఖలోని అధికారులు, సిబ్బంది చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. అలాగే తుఫాన్ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా అధికారులు తీసుకున్న చర్యల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా నివారించగలిగామని తెలిపారు. కాగా ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ జెడ్పీ సమావేశం చివరి సమావేశమని మంత్రి పేర్కొన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన 'విజయ దీపిక' పుస్తకాన్ని మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల దాష్టీకం

- అడ్డగోలుగా నగదు వసూలు
- భారీ మొత్తంలో ఫీజులు చెల్లించాలని డిమాండ్
- ఆందోళన చేపట్టిన విద్యార్థినులు, తల్లిదండ్రులు



పరీక్షలు రాయనివ్వకపోవడంతో నర్సింగ్ కళాశాల బయట ఉన్న విద్యార్థినులు

కావలి: బంగారు భవిష్యత్తు.. మూడేళ్ల కోర్సు పూర్తి కాగానే పెద్ద జీతంతో ఉద్యోగాలు.. పైసా కట్టాల్సిన అవసరం లేదు.. అంతా ప్రభుత్వమే చెల్లిస్తుంది.. చేరితే చాలు.. అంటూ రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి విద్యార్థినులను తమ కళాశాలలో చేర్చుకొని అవస్థలు పాలు చేస్తున్న విద్యాసంస్థ దాష్టీకం శనివారం కావలిలో వెలుగులోకి వచ్చింది. బాధిత విద్యార్థినులు, తల్లిదండ్రుల కథనం మేరకు కావలి పట్టణంలోని పుల్లారెడ్డినగర్‌లో 'శ్రీసాయి స్కూల్ ఆఫ్ నర్సింగ్' కళాశాల ఉంది. అందులో మూడేళ్ల బీఎస్సీ కోర్సు చదువుతున్న విద్యార్థినులు రాష్ట్రం నలుమూలల నుంచి 100 మందికి పైగా ఉన్నారు. అయితే విద్యార్థినులకు అన్నం కూడా సరిగా పెట్టేవారు కాదు. ప్రాక్టికల్స్ పేరుతో హైదరాబాద్ లాంటి చోట్ల ఉన్న ఆస్పత్రులకు విద్యార్థినులను తీసుకెళ్లినందుకు వసతి ఇతరత్రా ఖర్చులంటూ వారి నుంచి నగదు వసూలు చేసేవారు. ప్రభుత్వం ఇచ్చే ఫీజుల కోసం, వారి ఆర్థిక లావాదేవీల కోసం విద్యార్థినులను కందుకూరుకు తీసుకెళ్లి అక్కడ ఓ బ్యాంక్‌లో అకౌంట్ ఓపెన్ చేయించి నగదు వసూలు చేశారు. ఇలా పలు రకాలుగా విద్యార్థినుల చేతి చమురు వదిలిస్తూ వస్తున్న సదరు నర్సింగ్ కళాశాల నిర్వాహకులు, ఫైనలియర్ విద్యార్థినులు పరీక్షలు రాసే సమయానికి ప్రభుత్వం ఫీజులు జమ చేయలేదని చెప్పి, ఒక్కొక్కరు రూ.80,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. చెల్లించకపోతే పరీక్షలు రాయనివ్వబోమని ఖరాకండిగా చెప్పేశారు. దీంతో విద్యార్థినులు లబోదిబోమంటూ తమ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కావలికి సమీపంలో ఉన్న కొందరు విద్యార్థినుల తల్లిదండ్రులు నర్సింగ్ కళాశాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో స్థానికంగా ఉన్న అధికారులు అక్కడికి చేరుకుని విద్యార్థినులను పరీక్షలు రాసేలా కళాశాల నిర్వాహకులను ఒప్పించారు. కాగా కలెక్టర్ ఈ నర్సింగ్ కళాశాల వ్యవహారంపై సీరియస్ అయినట్లు తెలిసింది. సోమవారం జిల్లా వైద్యశాఖాధికారి నేతృత్వంలో ఈ నర్సింగ్ కళాశాల బాగోతంపై సమగ్ర విచారణ చేయడానికి రంగం సిద్ధం చేశారు. నర్సింగ్ కళాశాల అనుమతులు, వసతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఆర్థిక లావాదేవీలు తదితర అంశాలపై అధికారులు లోతుగా విచారించనున్నారు.

ఉత్తమ సేవలకు డీజీపీ కమెండేషన్ డిస్క్ మెడల్

- మెడల్ అందుకున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



ఎస్పీకి మెడల్ అందజేస్తున్న డీజీపీ

నెల్లూరు(క్రైమ్): నేరాల కట్టడి, శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్రవేస్తోన్న ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి డీజీపీ కమెండేషన్ డిస్క్ మెడల్ అందుకున్నారు. శనివారం మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి చేతులమీదుగా ఎస్పీ మెడల్ అందుకున్నారు. తిరుమలేశ్వరరెడ్డి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నేరాలను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతుండడంతో క్రమేపి జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయి. పదేపదే నేరాలకు పాల్పడుతూ ప్రజాజీవనానికి భంగం కలిగిస్తున్న రౌడీషీటర్లపై పీడీయాక్ట్‌లు నమోదు చేయడం, కన్విక్షన్ బేస్ పోలీసింగ్ విధానాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ కీలక కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేస్తున్నారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపట్టడంతో పాటు సంచలనాత్మక కేసుల్లో గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా డీజీపీ ఎస్పీ సేవలను ప్రశంసించారు.

నేటి నుంచి జాతీయ విద్యావిధానంపై వర్క్‌షాప్

నెల్లూరు రూరల్: నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఆదివారం నుంచి రెండు రోజులపాటు జాతీయ విద్యావిధానంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ గంగాభవాని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యావిధానంలోని మార్పులు, విద్యార్థులపై ఒత్తిడి లేని విద్య తదితర అంశాలపై ఈ వర్క్‌షాప్‌లో వివరించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యాశాఖ ఉన్నతాధికారులు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులు వర్క్‌షాపునకు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన, వివిధ అంశాలపై స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పూజల పేరిట బురిడీ

- రూ.9 లక్షలు దోచుకెళ్లిన దుండగులు

నెల్లూరు(క్రైమ్): ఆరోగ్యం బాగు చేసేందుకు పూజలు చేస్తున్నట్లు నటిస్తూ దంపతులను బురిడీ కొట్టించి రూ.9 లక్షలు నగదు దోచుకెళ్లిన ఘటన నెల్లూరులోని సరస్వతినగర్‌లో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. సరస్వతినగర్‌లోని ఆర్‌ఆర్ టవర్స్‌లో శ్రీనివాసులురెడ్డి – రాజమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి నగరానికి చెందిన సుబ్బారావు పరిచయస్తుడు. గత కొంతకాలంగా శ్రీనివాసులురెడ్డి పక్షవాతంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయిస్తున్నా ఆయన ఆరోగ్యం కుదుటపడలేదు. వైద్యపరీక్షల నిమిత్తం రూ.9 లక్షల నగదును దంపతులు ఇంట్లో ఉంచుకున్నారు. ఈ విషయాన్ని గమనించిన సుబ్బారావు ఎలాగైనా వాటిని కాజేయాలని పక్కా పన్నాగం పన్నాడు. అందులో భాగంగా తనకు తెలిసిన పూజారులు ఉన్నారని, వారు పూజలు చేస్తే ఆరోగ్యం కుదుటపడుతుందని గత కొద్దిరోజులుగా దంపతులను నమ్మించే ప్రయత్నం చేస్తూ వచ్చాడు. అతని మాయమాటలను గుడ్డిగా నమ్మిన వారు పూజలు చేయించుకునేందుకు అంగీకరించారు. సుబ్బారావు ఈ నెల 13వ తేదీన ఇద్దరు వ్యక్తులను పూజారులంటూ శ్రీనివాసులురెడ్డి ఇంటికి తీసుకువచ్చి పూజలు ప్రారంభించాడు. 15వ తేదీ మధ్యాహ్నం సుబ్బారావు పూజ పూర్తికావచ్చిందని, ఇంట్లో ఉన్న డబ్బులను పూజలో పెట్టాలని రాజమ్మకు సూచించాడు. దీంతో ఆమె ఇంట్లో ఉన్న రూ.9 లక్షల నగదును పూజలో పెట్టింది. అనంతరం ఆమెను అక్కడి నుంచి వెళ్లిపోవాలని నిందితులు సూచించారు. ఆమె వంట గదిలోకి వెళ్లడంతో ఇదే అదనుగా భావించిన సుబ్బారావు, పూజారుల ముసుగులో ఉన్న ఇద్దరూ అక్కడి నుంచి నగదుతో ఉడాయించారు. హాలులో ఎలాంటి అలికిడి లేకపోవడాన్ని గమనించిన రాజమ్మ వంటగదిలో నుంచి వచ్చి చూడగా సుబ్బారావు, పూజారులు కనిపించలేదు. జరిగిన విషయాన్ని ఆమె తన బంధువులకు తెలియజేసి నిందితుల కోసం చుట్టుపక్కల గాలించింది. సుబ్బారావుకు ఫోన్‌చేయగా ఫోన్ స్విచాఫ్ చేసి ఉండడంతో మోసపోయానని గ్రహించి శుక్రవారం అర్ధరాత్రి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మహబూబ్‌సుభాని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లపై నిశిత నిఘా

సంఘ విద్రోహ శక్తులపై ఎస్పీ ఉక్కుపాదం

- జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు
- రానున్న ఎన్నికలకు ముందస్తు ప్రణాళిక
- పోలీసుస్టేషన్ల వారీగా రౌడీషీటర్ల బైండోవర్

జిల్లాలో నేరాలను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించడంతో పాటు రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా రౌడీషీటర్ల కదలికలపై నిశిత నిఘా ఉంచింది. వారికి ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా పోలీసు స్టేషన్లలో కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు బైండోవర్లు చేస్తోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత హడావుడి పడకుండా పక్కా ప్రణాళికలతో ముందస్తుగా రౌడీషీటర్లపై చర్యలు చేపడుతోంది.


రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్(ఫైల్)

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సంఘ విద్రోహ శక్తులపై జిల్లా ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి ఉక్కుపాదం మోపుతున్నారు. రౌడీషీటర్లపై మరింత కఠినంగా వ్యవహరించడంతో పాటు వారిపై గల కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయించి వారికి శిక్షలు పడేలా చేస్తున్నారు. జిల్లాలోని ఐదు సబ్‌డివిజన్ల పరిధిలో 1,065 మంది కిపైగా రౌడీషీటర్లు ఉన్నారు. వీరిలో రౌడీ కార్యకలాపాలకు పాల్పడుతూ అరాచకాలకు తెగబడుతున్న 175 మందిని ఏ కేటగిరీలోకి చేర్చారు. వీరిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు పెండింగ్ కేసులపైనా దృష్టి సారించారు. ఆయా కేసుల్లో ఛార్జిషీట్లు వేసి విచారణ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో 38 మందికి ఏడేళ్ల నుంచి జీవిత ఖైదు వరకు శిక్షలు పడ్డాయి. ఏ కేటగిరీ రౌడీషీటర్లపై మిగిలిన కేసుల విచారణను సైతం వేగవంతమయ్యేలా చర్యలు చేపట్టారు. గతంలో పలు కేసుల్లో ఉండి తరచూ నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారిపై కొత్తగా రౌడీషీట్లు తెరుస్తున్నారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టారు. వారు ప్రస్తుతం ఎక్కడ ఉంటున్నారు..ఏం చేస్తున్నారు.. కుటుంబ నేపథ్యం..తదితర పూర్తి వివరాలను సేకరించారు. ప్రతి రోజూ పోలీసు అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని రౌడీషీటర్లను విధిగా తనిఖీ చేస్తున్నారు. వారు అందుబాటులో లేని పక్షంలో ఎక్కడికి వెళ్లారు? ఏ పని నిమిత్తం వెళ్లారు? తదితర వివరాలను కుటుంబ సభ్యుల నుంచి సేకరించి అది నిజమా? కాదా? అని నిర్ధారించుకుంటున్నారు.

రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని..

రానున్న ఎన్నికలకు జిల్లా పోలీసు యంత్రాంగం సన్నద్ధమైంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. గడిచిన ఎన్నికల్లో నమోదైన కేసులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయి.. నిందితులు ప్రస్తుతం ఏం చేస్తున్నారు.. రౌడీషీటర్లకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా..అన్న వివరాలను ఆరాతీస్తున్నారు. ఎన్నికల కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లు, ఎన్నికల నేరాలతో సంబంధం ఉన్న వారి కార్యకలాపాలపై సైతం పోలీసు అధికారులు నిఘా పెట్టారు. జిల్లాలోని రౌడీషీటర్లను బైండోవర్లు చేయాలని ఇప్పటికే పోలీసు అధికారులకు ఎస్పీ నుంచి ఆదేశాలు అందాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో గడిచిన రెండ్రోజులుగా బైండోవర్ల ప్రక్రియ కొనసాగుతోంది. నెల్లూరు నగరంలో అన్నీ పోలీసుస్టేషన్ల పరిధిలో రోజూ పదుల సంఖ్యలో బైండోవర్లు చేస్తున్నారు. ఎన్నికల వేళ అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని రౌడీషీటర్లను పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

రౌడీషీటర్లపై పీడీయాక్ట్‌లు

యాక్టివ్ రౌడీషీటర్లు, పాత నేరస్తులకు తమదైన శైలిలో కౌన్సిలింగ్ ఇచ్చి తీరుమార్చుకోవాలని, లేని పక్షంలో పీడీయాక్ట్‌లు ప్రయోగిస్తామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 11 మందిపై పీడీయాక్ట్ ప్రయోగించారు. తాజాగా మరికొంతమంది పైన పీడీయాక్ట్‌లు నమోదు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. నేరస్తులను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని కఠినంగా వ్యవహరిస్తామని పోలీసు అధికారులు తమ చేతల ద్వారా నిరూపిస్తున్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ అతిపెద్ద క్రీడా సంబరం


క్రీడా కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: ‘ఆడుదాం ఆంధ్రా మన రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద క్రీడా సంబరం. గ్రామీణ ప్రాంత యువతలోని క్రీడానైపుణ్యాన్ని వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు’ అని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆడుదాం ఆంధ్రాకు సంబంధించిన క్రీడా కిట్లను సచివాలయాలకు శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణకు దాదాపు రూ.100 కోట్లను ప్రభుత్వం కేటాయించిదన్నారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, తదితర ఐదు రకాల పోటీలను గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1.17 కోట్ల మంది పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. అందులో పురుషులు 68.14 లక్షలు, స్త్రీలు 49.43 లక్షల మంది ఉన్నారని వివరించారు. ఈ నెల 15 నుంచి పోటీలు జరగాల్సి ఉండగా ఇటీవల కురిసిన వర్షాలకు మైదానాలు తడిసిపోవడంతో ఈ నెల 26కు వాయిదా వేశారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల విజేతలకు ప్రథమ బహుమతి రూ.5 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.3 లక్షలు, తృతీయ బహుమతి రూ.2 లక్షలు అందజేయనున్నట్లు చెప్పారు. బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు సంబంధించి ప్రథమ బహుమతి రూ.2 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.లక్ష, తృతీయ బహుమతి రూ.50 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన శైలి కోసం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సమష్టిగా విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో అధికారులు,ప్రజాప్రతినిధులకు కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, తహసీల్దార్ సుబ్బయ్య,ఎంపీడీఓ నాగేంద్రబాబు,ఎస్సై వీరేంద్రబాబు, నిడిముసలి పీఏసీఎస్ అధ్యక్షుడు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం


సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి కాకాణి

నెల్లూరు (దర్గామిట్ట): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద అనేక వ్యాధులను చేర్చి సమర్థవంతంగా వైద్యసేవలు అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు కూడా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం అందించి బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన ఏడుగురు లబ్ధిదారులకు రూ.8 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి కాకాణి నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ప్రధానంగా వైద్య వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ఆరోగ్యశ్రీ కింద అనేక వ్యాధులకు శస్త్రచికిత్సలు అందిస్తున్నారని, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు వైద్యం చేయించుకుని అప్పులు పాలైన వారి కుటుంబాలు ఇబ్బందులు పడకుండా ఉదారంగా సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు రైల్వే స్టేషన్ పరిధిలోని గన్నవరం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడిన వ్యక్తి విజయవాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు..గన్నవరం రైల్వే స్టేషన్ సమీపంలోని మర్లపాళెం రైల్వే గేటు వద్ద ఈ నెల 15న రాత్రి 8.50 గంటల సమయంలో రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి(55) తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడ్ని 108 వాహనంలో విజయవాడ జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడ్ని నెల్లూరు నగరానికి చెందిన కాయల ఏడుకొండలుగా గుర్తించారు. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 80740 55378 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.


ఏడుకొండలు మృతదేహం

క్లుప్తంగా

కౌమార దశ చాలా కీలకం


అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ రమేష్

ఇందుకూరుపేట: పిల్లల్లో కౌమార దశ చాలా కీలకమైందని డైట్ ప్రిన్సిపల్ పీ రమేష్ అన్నారు. పల్లిపాడులోని డైట్ కళాశాలలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు కౌమార విద్యపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌమార దశ 10–19 ఏళ్లలోపు ఉంటుందని తెలిపారు. ఈ దశలో పిల్లల్లో శారీరకంగా, మానసికంగా మార్పులు చోటు చేసుకుంటాయని వివరించారు. జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ కౌమార దశలో పిల్లల వచ్చే శారీరక మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల అధ్యాపకులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్ బైక్ అదుపుతప్పడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు..గూడూరుకు చెందిన శ్రీనివాసులు పని నిమిత్తం మోటార్‌బైక్‌పై ముత్తుకూరు మండలం పంటపాళేనికి వచ్చాడు. తిరిగి గూడూరుకు వెళ్తున్న క్రమంలో సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం రోడ్డుపై మోటార్ బైక్ అదుపు తప్పడంతో శ్రీనివాసులు గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీపీఎస్సీ గ్రూప్–2 ప్రిలిమినరీ పరీక్షలకు హాజరయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి 60 రోజుల పాటు 60 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈ నెల 22లోగా నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శోధననగర్‌లో ఉన్న బీసీ స్టడీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 93815 54779, 93902 39588 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: రూ.123
లేయర్ (లైవ్)	: రూ.100
బ్రాయిలర్ చికెన్	: రూ.220
స్కిన్‌లెస్ చికెన్	: రూ.244
లేయర్ చికెన్	: రూ.170

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ. 20
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ. 5

బాలాజీనగర్‌లో చోరీ

- రూ.50 వేలు సొత్తు అపహరణ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన బాలాజీనగర్‌లో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు..బాలాజీనగర్ గాడ్ హాస్టల్ సెంటర్‌లో శిరీష కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె అల్లూరులోని ఓ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. ఈ నెల 4న శిరీష నెల్లూరులోని ఇంటికి వచ్చి పనిచూసుకుని తిరిగి వెళ్లిపోయారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని రూ.50 వేల విలువచేసే బంగారు ఆభరణాలు, కొన్ని వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. శనివారం తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు ఆమెకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. బాధితురాలు నెల్లూరుకు చేరుకుని చోరీ ఘటనపై బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.